# తలుపుతట్టే అవకాశం



**రాజారాంకు** పెళ్ళి పందిట్లో దూరంగా కనబడిన వ్యక్తి పరిచయస్తురాలిలా కనబడి ఆలోచనలో పడ్డాడు - 'సుశీలమ్మగారా? ఆ. ఆవిడే. చూసి ఇరవై ఏళ్ళయ్యిందిగా, గుర్తుపట్టడం కష్టమయింది, మరీ అంత కష్టం కాదులే. ఆవిడలో పెద్ద మార్పు రాలేదు. ఆ అందం, ఆ సౌష్టవం అలాగే ఉంది. దగ్గరి కెళ్ళి పలకరిస్తే? అమ్మో, గతంలో జరిగినది ఆవిడకు గుర్తుంటే? ఉండే వుంటుంది. ఇన్నేళ్ళయినా తనకు గుర్తు లేదూ? అలాగే ఆమెకీనూ. అనాడు అమె అన్నది తను మర్చిపోగలిగేడా?'

రాజారాం ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. సుశీలమ్మను చూసాక వెళ్ళి పలకరించకుండా ఉండటం అసాధ్యమనిపించింది. ఉండబట్టలేక దగ్గరికెళ్ళి "ఏమండీ, గుర్తున్నానా?" అన్నాడు.

ఆవిడ ఒక్క క్షణం తేరిపార చూసింది. "నువ్వా? రాజా? చటుక్కున్న గుర్తుపట్టలేకపోయాను

సుమా! చాలా మారిపోయావు. ఆ బట్టతలేమిటి? ఆ సోడాబుడ్డి కళ్ళద్దాలేమిటి? ఎంత నాజుగ్గా ఉండేవాడివి, ఎలా అయిపోయావ్!" అంటూ చాలా ఆప్యాయంగా మాట్లాడింది. తన గురించి, భార్య గురించి, పిల్లల గురించి వివరాలడిగి తెలుసుకుంది. వాళ్ళపిల్లలు సెటిలయ్యారుట. వాళ్లాయన వేరే పెళ్ళి కెళ్ళవలసివస్తే ఈవిడ ఈ ఫంక్షన్‌కి ఒంటరిగా రావలసి వచ్చిందట. ఆవిడ మాట్లాడుతుండగానే ఎవరో వచ్చి పలకరించారు.

"మీరు వెళ్ళండి. పెళ్ళి హడావుడిలో ఉన్నట్టున్నారు. భోజనాల దగ్గర కలుద్దాం" అంటూ రాజారాం వచ్చి దూరంగా కూచున్నాడు. ఎవరెవరో వచ్చి కబుర్లు చెబుదామని చూస్తున్నారు. కానీ అతని చూపులు సుశీలమ్మ చుట్టూనే తిరుగుతున్నాయి. ఎంత చక్కటి శరీరం. ఏం వంపులు... అప్పుడు, ఇరవై ఏళ్ళ క్రితం ఎంత మత్తెక్కించాయో! ఆ వంపులు చూసే కదూ, తను తొందరపడింది.

అప్పుడావిడ వయసు 35. తనకు 20. దూరపు బంధువులు కాబట్టి తరచు, వాళ్ళింటికి వెళ్ళి వస్తూండేవాడు. చదువు అయిపోయి, బందర్లోనే ఉండి ఉద్యోగాల కోసం అప్లయి చేసే రోజులు. బోల్డంత తీరిక. అయన ఉన్నా, లేకపోయినా వాళ్ళింటికి వెళ్ళే చొరవ ఉండేది. సుశీలమ్మ హాయిగా కబుర్లు చెప్పేది. తననందరూ రామం అని పిలిచినా ఆవిడ మాత్రం రాజా అనేది. తనకు గిలిగింతలు పెట్టేట్టు కొంటెగా మాట్లాడేది. ఆవిడను చూడడానికైనా వారానికోసారి తప్పకుండా వెళ్ళేవాడు.

ఆవేళ మధ్యాహ్నం జరిగినది ఏ ఒక్క విషయమూ బీరుపోకుండా, తనకు గుర్తుంది. శనివారం సుమారు మూడు గంటలయి ఉంటుంది. తను వెళ్ళాడు. ఆవిడ ఒక్కత్తీ ఉంది. ఆయనా, పిల్లలూ ఊరెళ్ళారట.

"పిల్లలకు సెలివిచ్చారుగా. ఈయన వాళ్ళను తీసుకుని మా మరిదిగారి ఊరికెళ్ళారు. అక్కడ రెండు రోజులుండి వాళ్ళ పిల్లల్ని కూడా వెంటపెట్టుకుని వస్తారు. వాళ్ళకీ సెలవలేగా" అందావిడ.

ఓ పావుగంట సేపు అవీ, ఇవీ మాట్లాడేక " మా మరిదిగారి పిల్లలు కూడా వస్తున్నారన్నానుగా. సెలవులుకదా, పదిరోజులుంటారు. పెద్దగిన్నెలూ, కంచాలు అటకమీద నుంచి దింపించి తోమిద్దామనుకున్నాను. సమయానికి వచ్చావు. కాస్త సాయం చేస్తావా? అటక మీద నుంచి దింపేద్దాం" అంది.

అటకకు నిచ్చెన వేసి, తనను పైకెక్కించింది. పైన రేకు పెట్టెల్లో ఏవేవో సామాన్లు. " అది కాదు, అంతకంటే పెద్దది. మధ్యలో సొట్ట ఉంటుంది." అంటూ కింద నుంచి డైరెక్షన్లు ఇచ్చాక, "ఏదీ చూపించు" అంటూ నిచ్చెన సగం దాకా ఎక్కడం. ఇవన్నీ సాగుతున్నంత సేపూ తను అటక మీద నుంచి ఆమెను తనివితీరా చూసాడు. అనువైన ఏంగిల్లో ఉండడం వల్ల ఆమె అందాలన్నీ వెన్నెల్లో ఆరబోసినంత హాయిగా కనువిందు చేసాయి. కుచ్చిళ్ళు ఎత్తి పెట్టడం వల్ల పిక్కలు, వంగినప్పుడు జఘనం కొట్టవచ్చినట్లు కనబడి తనకు పిచ్చి ఎత్తించేయి. జాకెట్టు పాతదిలా గుంది. పెట్టిన పిన్నీసు వంగిపోయింది... బరువు ఓపలేక కాబోలు. ఆ చీలిక కొండల మధ్య కనుమలా, స్వర్గానికి వేసిన తెల్లని రోడ్డులా...ఛ, తనకి కవిత్వం రాదు. తన మనస్సులాగే ఆమె పమిట కూడా స్థిరంగా ఉండలేకపోతోంది. అస్తమానూ జారిపడిపోవడమే. నిచ్చెనెక్కి గిన్నెలు అందుకునేటప్పుడు పైట చేతుల కడ్డం పడడంతో విసుక్కునేది. తనూ పైకి 'అరెరే' అని కన్నాడు కానీ లోపల చాలా సంతోషించాడు. అలా రెండు సార్లయ్యేక " ఛ, వెధవపైట, అడ్డొస్తోంది" అంటూ దాన్ని నడుం చుట్టూ బిగించి చీరలోకి దోపింది.

దోపడంలో చీర కిందకు దిగజారి చదునైన ఆమె పొట్ట, ఆ సైకతంలో సుడిగుండంలా ఆమె నాభి తనను పలకరించాయి. ఈమె పిల్లల తల్లి అంటే ఎవరైనా నమ్మగలరా? నిలవరించుకోవడం అసాధ్యమయింది. అయినా ఎలాగో ఉగ్గబెట్టుకున్నాడు. కానీ ఆమె ఆ స్థితిలో సగంపైన నిచ్చెన మెట్లు ఎక్కి, 'ఆ దబరా గిన్నెలు కూడా ఇచ్చేయి' అంటూ చేతులు చాపినప్పుడు తన చూపులామె వక్షోజాల మధ్యనే ఇరుక్కుపోయాయి. వాటిని కన్నార్పకుండా చూస్తూనే యాంత్రికంగా గిన్నెలు ఆమె చేతి

కందించాడు. అంతలోనే తట్టింది - చేతుల్లో గిన్నెలు ఉండగా ఆమె తన వక్షాన్ని కాపాడుకోలేదని. ఇక ఉండబట్టలేక తన చేతులకు స్వేచ్ఛ ఇచ్చేశాడు.

ఆమె అదోలా చూసింది, "ఆయన లేరని ధైర్యం చేస్తున్నావు కదూ. రాత్రికి రా. నీ పని చెప్తాను" అంది. దాంతో తనకి ఒక్కసారిగా భయం వేసింది. వెన్నెలోంచి చలి పుట్టుకొచ్చింది. తను చేసినదేమిటో తెలిసివచ్చింది. ఒక్కసారిగా, పరిగెడుతున్నట్టు, ఆమెను తోసుకుంటూ, నిచ్చెన దిగిపోయి బయటకు పారిపోయాడు. ఇల్లు చేరినా వణుకు తగ్గలేదు. అందరికీ చెప్పేస్తుందేమో! నాన్నగారి దెబ్బలు తలుచుకుంటే భయం వేసింది. బంధువుల్లో తనకున్న మంచిపేరు పోతుందేమో, 'ఇలాటివాడా? రామం' అని అందరూ ముఖాన ఉమ్మేస్తారేమో. బాబోయ్!

అప్పట్నుంచీ సుశీలమ్మగారింటికి వెళ్ళనే లేదు. అదృష్టం బాగుండి అది జరిగిన వారం రోజులకే తనక ఉద్యోగం వచ్చి బందరు వదలి వెళ్ళిపోవలసి వచ్చింది. ఉద్యోగంలో చేరిన ఏడాదికిగానీ మళ్ళీ బందరు వెళ్ళలేదు. అప్పటికీ సుశీలమ్మ మొగుడికి బదిలీ అయిపోయింది.

" ఏమోయ్ రాజా, అంత దీర్ఘాలోచనలో పడ్డావు" అంటూ సుశీలమ్మ పలకరించడంతో వర్తమానంలోకి వచ్చాడు రాజారాం. తొట్రుపడి "అబ్బే, ఏమీ లేదు" అంటూనే "రండి, కూచోండి. డిన్నర్‌కి ఇంకా టైమున్నట్టుంది" అన్నాడు గబగబా.

"కూచోడానికి కాదు, విడిదిలో కాస్త పని వుంది. దూరంగా ఇచ్చారు. చిమ్మచీకటి. కాస్త తోడొస్తావేమోనని.." అందామె.

" తప్పకుండా... పదండి" అంటూ వెంట నడిచేడు రాజారాం.

ఆమె వెంట నడుస్తూంటే భలే తమాషాగా అనిపించింతనికి. చుట్టూ చీకటి. పెళ్ళి వారిగోల సుదూరంగా, నేపథ్య సంగీతంలా. ఆమె పట్టుచీర రెపరెప, ఒంటి మీది సెంటు, చుట్టూ మొక్కల నుంచి వచ్చే పరిమళానికి తోడుగా, ఆమె అడుగుతోంది, "చిన్నప్పుడు ముద్దొచ్చేవాడివి. నాజుగ్గా ఉండేవాడివి. ఇరవై ఏళ్ళొచ్చినా, ఇప్పుడేమిటి? నలభై ఏళ్ళకే బొజ్జ.. బట్టతల.. మీ ఆవిడేమీ అనదా ఏమిటి?" అంటూ గల గల నవ్వింది.

ఆవిడ చనువు చూసి రాజారాంకు ధైర్యం వచ్చింది. ఎన్నో ఏళ్ళగా చెప్పలేని క్షమాపణ ఇప్పుడు చెప్పేస్తే మంచిది, మన్నిస్తుంది అనుకున్నాడు. "ఆవేళ మధ్యాహ్నం చేసినదానికి సిగ్గుపడుతున్నాను. మీరేమనుకున్నారో ఏమో గానీ, తర్వాత చాలా ఇదయ్యేను" అన్నాడు నట్టుతూ.

ఆవిడ నవ్వింది, మనోహరంగా. "అదా?"అంది. "ఆవేళ రాత్రి రాలేదేం? మళ్ళీ కనబడకుండా పోయేవు కూడా, ఊరొదిలి వెళ్ళేటప్పుడైనా నేను గుర్తుకురాలేదు" అంది ఫిర్యాదు చేస్తున్నట్లు.

రాజారాం బుర్ర తిరిగింది. "రాత్రికి రావడం ఏమిటి? వస్తే అందరికీ చెప్తానన్నారుగా" అన్నాడు.

ఆవిడ తెల్లబోయింది. "నీ మొహం! నేను అందరికి చెప్తాననడం ఏమిటి? నేనన్నదేమిటి? - నీ పని చెప్తానన్నాను. నువ్వు చేసినదానికి అంతకంత జవాబు చెప్తానని అర్థం. పైగా ఆయన ఊళ్ళో లేరని గుర్తు చేస్తున్నా కూడా కదా.." అంటూ ఆమె అంటూండగానే రాజారాంకు హఠాత్తుగా స్ఫురించింది. 'పని చెప్తాననడంలో' అర్థం.

"ఆదది అంతకంటే విపులంగా ఏం చెప్తుందయ్యా, నీ కంగార్లో నువ్వు గ్రహించలేకపోయావు కానీ.." అంటోంది ఆవిడ.

రాజారాం కాస్సేపు ఆగి, అర్థం చేసుకున్నట్టు తల పంకించాడు. 'నా కర్థం కాలేదప్పుడు' అనుకున్నాడు.

ఇప్పుడు రాజారాంకు అర్థమయింది.

రాజారాంలో ఒక్కసారిగా ఉద్రేకం పొంగివచ్చింది. ఆనాడు తను పోగొట్టుకున్నది ఇన్నాళ్ళకు మళ్ళీ అందించాడు భగవంతుడు. నడక ఆపి నిలిచిపోయాడు. ఆమె భుజాలు పట్టుకుని తనవైపుకు తిప్పుకుంటూనే నడుం చుట్టేసి, దగ్గరకు లాక్కోబోయాడు. కానీ సుశీలమ్మలో ఆ తొందరపాటు కనబడలేదు. నిదానంగానే చెప్పింది -

" అప్పుడు చెయ్యలేని పని ఇప్పుడు చెయ్యాలని చూడకు. ఆ పొంగు అలాటిది. అది అలా విఫలమయ్యేక రెండేళ్ళపాటు నీకోసం కలవరించేను. నిజమే. కానీ తర్వాత ఆ ధ్యాస పోయింది. నువ్వు నా గురించి పట్టించుకోలేదన్న కోపం నా కోరికను క్రమంగా చంపేసింది. ఇప్పుడు తెలిసివచ్చింది. నువ్వు సరిగ్గా అర్థం చేసుకోలేకపోయావని. నీ తెలివితక్కువతనం ధర్మమాని నా పాతివ్రత్యం నిలబడింది. అన్నీ ఉడిగిపోయిన తర్వాత ఇప్పుడు దాన్ని పాడుచేసుకోవడం ఎందుకు? అందునా నువ్వు మునపట్లా లేవుగా.." అని ఆమె అనగానే రాజారాం చేతులు యాంత్రికంగానే పట్టు సడలాయి.

ఆమె వడివడిగా అడుగులేసింది. రాజారాం కూడా అమె వెంట అదే వేగంతో నడవబోయేడు.

"విడిది దగ్గరపడింది. ఆ మూల గదిలో మగాళ్ళెవరో పేకాడుతున్నట్టున్నారు. అదృష్టం తలపు తట్టేది ఒక్కసారే. అప్పుడు తలుపు తీయకపోతే తిరిగి రాదది. నువ్విక్కడే కాస్సేపాగి, మరీ లోపలికిరా. ఎవరైనా చూస్తారేమో" అని, రాజారాం జవాబు చెప్పేలోపునే ఆమె గబగబా లోపలికి వెళ్ళింది.

ఆ రోజు లగాయితూ ఆ శనివారం మధ్యాహ్నం గుర్తు వచ్చినప్పుడల్లా రాజారాంకి పిచ్చి ఎక్కినట్టుండేది.

●

(ఆంధ్రభూమి వీక్లీ ఏప్రిల్ 1999)

# ఆలూమగలీయం

## చదువులూ... 'సంధ్య'లూ...

2000 ఎంసెట్‌లో ఫలితాల్లో బాలుర ముందంజ,
ఇంటర్‌లో బాలికల ముందంజ - వార్త

"చూసారా? ఇంటర్‌లో అమ్మాయిలదే గెలుపు. వాళ్లే ఎక్కువమంది పాసయ్యేరు"

"దానికి పెద్ద హడావుడెందుకు?"

"నిన్న ఎంసెట్‌లో అబ్బాయిలెక్కువ మంది పాసయితే మీరు హడావుడి చేయలేదూ?"

"అమ్మాయిలు గెలుపొందిన ప్రతీసారి నువ్వు దండోరా కొడుతుంటావు కాబట్టి, అబ్బాయిల గురించి చెప్పే ఛాన్స్ రాగానే నేను చెప్పానంతే!"

"బావుంది. 'కానీ ఆ ఆనందం షార్ట్‌లివ్‌డ్ సుమా, మళ్లీ ఆడవాళ్లే విజయకేతనం ఎగరేసారు' అని చెబుతున్నాను. తప్పేముంది?"

"ఏది షార్ట్ లివ్‌డ్? అమ్మాయిలకు ఎక్కువ మార్కులు రావడం ఈ మధ్యే కదా! ఇదివరకంతా అబ్బాయిలదే పై చేయి! ఈ ట్రెండే షార్ట్ లివ్‌డేమో, ఎవడు చూడొచ్చాడు?"

"అబ్బాయిలిదివరకు పాసయ్యారంటే స్లిప్పులు పెట్టి పాసయి ఉంటారు. మీరు అప్పుడప్పుడు చెబుతూంటారుగా, భారతదేశ చరిత్రంతా ఒక్క రుమాల్లో పట్టేసేదని..."

"..అంటే అమ్మాయిలు కాపీ కొట్టరనా? వాళ్లు స్లిప్పులు ఎక్కడ దాచారో కనిపెట్టడం మహా కష్టం. మగ ఇన్విజిలేటరు గట్టిగా చూస్తే మరో ఉద్దేశ్యంతో చూస్తున్నాడని కంప్లెయింటు ఇవ్వగలరు కూడాను."

"మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. మీరే ఆ ఉద్యోగం చేస్తే మీ చూపులు ఎక్కడ ఇరుక్కుపోయేవో నాకు తెలుసు. ఇంకా బోల్డు చోట్ల దాచవచ్చు. కానీ కుదరదు. ఆడ స్క్వాడ్ వాళ్లు వచ్చి చెక్ చేస్తారు."

"ఆc, అంత మంది ఫిమేల్ స్టాఫ్ ఎక్కడున్నారులే! అదేం కాదులే గానీ, ఆడవాళ్లు చదువుల మీద పడ్డారు. కొత్త బిచ్చగాడు పొద్దెరడగన్నట్టు తెగ చదివేస్తున్నారు..."

"...అవును మరి. ఏం చేస్తారు? కన్నెచెర వదలాలంటే చదువు చదవక తప్పని పరిస్థితి వచ్చేసింది. ఇదివరకైతే మొగుడికి కార్డుముక్క రాసుకునే చదువొస్తే చాలనేవారు. రోజులు మారాయి.."

"..ఆ మాట కొస్తే ఇప్పుడు కార్డు ముక్కా రాయనక్కరలేదు. ఫోన్ చేసి మాట్లాడేయచ్చు.."

"నా పాయింటు గ్రహించండి మహానుభావా. ఇదివరకు కంటికి కాస్త నదురుగా ఉంటే చాలు, పెళ్లయ్యేది. లేదా వంశం, వంగడం, జాతకం, కట్నం.. ఇలా ఏదో ఒక ఫ్యాక్టర్ బాగున్నా పెళ్లయ్యేది.."

"..ఇప్పుడు మాత్రం ఇవన్నీ అక్కర్లేదంటున్నారా?"



"అక్కరలేదనటం లేదు గాని వీటన్నిటికంటే ముఖ్యమైనది ఉద్యోగం అయిపోయింది. పెళ్లాన్ని పోషించే సత్తా ఉడిగి, ఈనాటి మగాడు సంపాదించే భార్యే కావాలంటున్నాడు. ఆడదానికి పెళ్లవాలంటే ఉద్యోగం కావాలి. ఉద్యోగం కావాలంటే చదువుండాలి..."

"..అందుచేత పెళ్లి గురించే ఈ ఆడపిల్లలంతా చదువులమీద పడ్డారంటావ్? అంతేగాని ఆత్మవిశ్వాసం కోసం, ఆత్మగౌరవం కోసం, విజ్ఞానం కోసం కాదంటావ్?"

"ఆ మాటంటే నేనొప్పుకోను. పెళ్లి కాకపోతే ఆడవాళ్లకు దిక్కు లేదనే కబుర్లు చెప్పకండి. ఏదో మొగవాడు ఒంటరిపక్షిలా ఉండిపోతాడు కదాని..."

"...జాలి దలుస్తున్నారన్నమాట. చాల్లేవోయ్ బడాయ్. ఇదంతా ఎందుకులే 'ముదితల్ నేర్వగరాని విద్య కలదే ముదమారగ నేర్పించగన్...' అని చెప్పుకోవచ్చుగా..."

"..ముదమారగ నేర్పించే దెవరులెండి! అవసరం కొద్దీ వీళ్లే నేరుస్తున్నారన్నది పరమసత్యం. ఆడవాళ్లకు అవరోధాలు కల్పించినంతకాలం వాళ్లలో చదువు తక్కువగా ఉండింది. ఇప్పుడు ఆ అడ్డంకులు తొలగుతున్న కొద్దీ వాళ్ల తడాఖా చూపిస్తున్నారు."

"పోన్లే, ఆ అడ్డంకులు తొలగించింది మగవాళ్లేగా. అబ్బాయిలతో పాటు అమ్మాయిలకూ చదువులు చెప్పిస్తున్నారని వాళ్లను మెచ్చుకోవచ్చుగా..."

"మీరెంతసేపూ తండ్రి గురించే ఆలోచిస్తున్నారేం? తల్లి పట్టుబడుతోందేమో – 'పై ఊళ్లకు పంపడానికి ఒప్పుకోక మా వాళ్లు నాకు చదువు పెద్దగా చెప్పించలేదు, మనమ్మాయినైనా చదివిద్దా'మని అంటోందేమో.."

"అంటారు గానీ, ఇల్లు నడిపే భారం ప్రధానంగా మగాడి మీదే పడుతోందిగా, పోనీ పాపం అని వాళ్లకు రిజర్వేషన్ ఇస్తున్నారా? లేదే! బాగా చదివే ఆడపిల్లలకే రిజర్వేషన్! ఇది ఘోర అన్యాయం! వెనకబడ్డవాళ్లకు రిజర్వేషనివ్వాలి గానీ..."

"..చదువులో ముందర పడవద్దని మగాళ్లనెవరైనా బతిమాలారా? శ్రద్ధపట్టి చదవచ్చుగా! అసలు ఉండాల్సిన తెలివి లేదని ఒప్పుకోండి."

"నాన్సెన్స్! చదువుదురు గానీ వాళ్లకు వ్యాపకాలెక్కువ! సినిమాలు చూడడం, అమ్మాయిల వెంటపడడం, ఫ్రెండ్స్‌తో బయట తిరిగి జనరల్ నాలెజ్ పెంచుకోవడం – వీటి వల్ల టైము వేస్టవుతుంది. ఆడాళ్లకేముంది? ఇంట్లోనే పడివుంటారు. టీవీ బోరు కొడితే ఇంకేం తోచక చదివేస్తారు.."

"ఇన్ని కారణాలు చెబుతారు గానీ 'ఆడవాళ్ల కంటె మాకు తెలివితేటలు తక్కువ' అని ప్లెయిన్‌గా ఒప్పేసుకోరు గదా!"

"లోకంలో ఆడవాళ్లందరి గురించి నువ్వింత దూరం వాదిస్తున్నావు కదా, నీ సంగతేమిటి? ఎంసెట్‌లో సీటెందుకు రాలేదు? ముప్ఫై మూడు పెర్సెంట్ రిజర్వేషన్ ఉండి కూడా..."

"మీలాటి ఆర్డినరీ గ్రాజుయేట్‌ను చేసుకోవాలని రాసి పెట్టుంటే ఇంజనీరింగులో సీటెలా వస్తుంది?"

"ఉద్ధరించేవులే! అసలు కారణం చెప్పు! నీకు ఇంటర్లో మార్కులెన్ని వచ్చాయి?"

"చెప్పానుగా, అంతా గ్రహప్రభావం!"

"గాడిదగుడ్డు ప్రభావం! నేనేమనుకోను, నిజం చెప్పు.."

"చెప్పేదేముంది? మీరు చెప్పారుగా కారణాలు, అబ్బాయిలకు మార్కులెందుకు రావో.."

"..అంటే!?"

"అంటే.. నేనూ అబ్బాయిల్లాగానే బలాదూరుగా తిరిగేదాన్ని. మా సూరిబావ తెలుసుగా.. అప్పట్లో నన్ను పెళ్లి చేసుకుంటానని వెంటపడేవాడని చెప్పేనూ.. అతను.."

"...తెలుసులే, కొంగలా ముక్కు వాడూనూ..."

"...అతనే... సినిమాలకూ, షికార్లకూ తెగ తిప్పేవాడు. దాంతో చదువు వెనకబడింది. ఓసారేమయిందో తెలుసా...?"

"...తెలియదు. తెలుసుకోవాలని లేదు కూడా. ఇప్పటికే అనవసరంగా అడిగాను. బుద్ధొచ్చింది... ఇక అపు."